క్లుప్తంగా

వెంకటస్వామికి జ్యోతిష్య జ్ఞానరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటస్వామి

శ్రీకాకుళం: అరసవల్లికి చెందిన డాక్టర్ మంత్రి వెంకటస్వామి జ్యోతిష్య జ్ఞానరత్న అవార్డును అందుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం కపిల తీర్థం వద్ద విశ్వజ్యోతి జోతిష్య 13వ విజ్ఞాన సమేళన సదస్సులో అవార్డును ప్రదానం చేసినట్టు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టీటీడీ ప్రధాన అర్చకులు అర్చకం వేణుగోపాల దిక్షుతులు, కపిలసిద్ధి దేవస్థానం ప్రధాన అర్చకులు సంబంధం గురుకులు అవార్డును అందించినట్టు పేర్కొన్నారు.

గురుమూర్తికి ప్రథమ బహుమతి



గురుమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

రణస్థలం: శ్రీకాళహస్తీశ్వర మహత్యం నాటకంలో హరిద్విజుడు పాత్రకు రణస్థలం మండల కేంద్రానికి చెందిన బోనం గురుమూర్తికి ప్రథమ బహుమతి లభించిందని ఆయన సోమవారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా లైన్స్ క్లబ్‌లో శ్రీవాణి కల్చరల్ ఆర్ట్స్ అధినేత పి.జె.నాయుడు, కళా సంఘాల ప్రతినిధులు కలిసి ఉత్తరాంధ్ర స్థాయి పౌరాణిక నాటక ఏకపాత్రాభినయ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిగా గురుమూర్తికి ఇత్తడి కిరీటంతో అలంకరించి, నగదు పారితోషికం అందించి ఘనంగా సన్మానించారు.

జేసీఐ ప్రతినిధికి సత్కారం



భీమశంకరరావును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్‌ను స్థాపించి 38 సంవత్సరాలు పూర్తయింది. శ్రీకాకుళంలో డాక్టర్ జామి భీమశంకరరావు జేసీఐను ఆరంభించి.. ఎన్నో సేవలు, సహాయ సహకారాలు అందించారు. ఇండియాలో ఈసంస్థను స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇటీవల కోల్‌కత్తాలో జేసీస్ డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జేసీస్ తరపున శ్రీకాకుళంలో సేవలందిస్తున్న భీమశంకరరావును జేసీస్ నేషనల్ ప్రెసిడెంట్ రాకేష్ శర్మ సత్కరించి అభినందించారు.

మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకరణ చేస్తున్న సభ్యులు

జి.సిగడాం: మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షురాలిగా చిర్రా లక్ష్మి (సంతవురిటి), ఉపాధ్యక్షురాలిగా కోరాడ వాణిశ్రీ (చంద్రయ్య పేట), కోశాధికారిగా లెంక ఉమ(జి.సిగడాం), కార్యదర్శిగా అల్లు గౌరీ, ఉపకార్యదర్శిగా లెంకజ్యోతి (గేదెలపేట)ని ఎన్నుకున్నారు. ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ అందరి సహకారంతో సంఘాలను బలోపేతం చేస్తామన్నారు. అర్హత ఉన్న సంఘాలకు బ్యాంకు నుంచి ప్రత్యేక రుణాలను మంజూరు చేసేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గం సభ్యులు, సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఫిర్యాదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం స్థల ఆక్రమణలపై ఆర్డీఓ రంగయ్య, తహసీల్దార్ సింహాచలంకు ప్రిన్సిపాల్ ఎం.గుణస్వామి, ఉపాధ్యాయులు సోమవారం ఫిర్యాదు చేశారు. గురుకుల పాఠశాల 1983లో ఏర్పాటైందన్నారు. 1986లో భవిష్యత్ అవసరాల కోసం సమీపంలోని 14.72 ఎకరాల స్థలం గురుకుల సొసైటీ కొనుగోలు చేసిందన్నారు. ప్రైవేట్ వ్యక్తుల నుంచి కొనుగోలు చేసిన ఈ స్థలం ఆక్రమణలకు గురవుతుందన్నారు. స్థలాన్ని చదువును చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కొందరు తమకు అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని అంటున్నారన్నారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు రెవెన్యు అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలంపై సమగ్ర విచారణ నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఉపాధి సిబ్బందిపై ఫిర్యాదు

జి.సిగడాం: గ్రామసభ తీర్మానం లేకుండా ఇష్టారాజ్యంగా అభివృద్ధి పనులు చేసి బిల్లులు చేయించుకున్న ఉపాధి హామీ పథకం సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ చిట్టిరాజును పాలఖండ్యాం సర్పంచ్ ధారబోయిన రెయ్యమ్మ అధికారులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఉపాధి సిబ్బందిపై డ్వామా పీడీకి ఫిర్యాదు చేశారు.

తీరంలో స్వచ్ఛసాగర్



గార మండలంలోని కె.మత్స్యలేశం పంచాయతీలో ఉన్న బుద్దా పాఠశాల యువ టూరిజం విద్యార్థులు బీచ్ పరిశుభ్రత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సాగర్ తీరంలో చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. స్వచ్ఛతా హి సేవపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.లలిత, పాఠశాల చైర్మన్ బి.ఎర్రన్న, గోవింద్, కుమార్ పాల్గొన్నారు. -గార

హిందీతో దేశ సమగ్రత



దేశ సమగ్రతకు, జాతీయ సమైక్యతకు రాజభాష హిందీ అవసరమని విశ్రాంత వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కె.వేణుగోపాలరావు అన్నారు. హిందీ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న హిందీ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం వికాస్ హైస్కూల్లో హిందీ దివస్ సభ జరిగింది. హిందీని ప్రతిఒక్కరూ నేర్చుకోవాలన్నారు. హిందీ మంచ్ సహకార్యదర్శి భగత్ 20 ఏళ్లుగా తాము చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. వ్యాసరచన పోటీలో గెలుపొందిన రక్షిత, రియంషికాలకు బహుమతులు అందించారు. పాఠశాల డైరెక్టర్ కె.మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ జి.నిర్మల పాల్గొన్నారు. -శ్రీకాకుళం కల్చరల్

నృత్య ప్రదర్శన



అన్నవరం వీర వెంకట సత్యన్నారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం జరిగిన సంగీత నృత్యోత్సవంలో శ్రీకాకుళం నగరానికి చెందిన నాట్య గురువు కె.పరిమళ హరిహరరావు బృందం నృత్య ప్రదర్శన అలరించింది. ఉత్సవాలలో తిల్లానా, శ్రీమన్నారాయణ, కాలభైరవ అష్టకం, గరుడ గమన, ముద్దుగారే యశోద తదితర నృత్యాంశాలు చక్కగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా స్వామివారి జ్ఞాపికలు, తీర్థ ప్రసాదాలతో పరిమళ బృందాన్ని ఆలయ ప్రతినిధులు సత్కరించారు. -శ్రీకాకుళం కల్చరల్

సాగునీరు అందించండి

- మీకోసంలో కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే కిరణ్ విజ్ఞప్తి



జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నారాయణపురం కాలువ ద్వారా ఎచ్చెర్ల మండలంలోని శివారు ప్రాంత ఆయకట్టుకు సాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సాగునీరు అందకపోవడంతో ఫరీదుపేట, పూడివలస, ఇబ్రహింబాద్, సనపలవానిపేట, కుశాలపురం, తోటపాలెం, కొత్తపేట, ముద్దాడ, కొంగరాం, భగీరథపురం, ధర్మవరం, బొంతలకోడూరు, పొన్నాడ తదితర గ్రామాల పరిధిలోని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. తక్షణమే సాగునీరు అందించి వరిసాగుకు సహకరించాలని కిరణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. అలాగే పలువురు వివిధ సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రాలను అందజేశారు.

- శ్రామిక మహిళల పనిప్రదేశాలలో ఫిర్యాదుల కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని శ్రామిక మహిళ జిల్లా కో-కన్వీనర్ ఎ.మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థలలో టాయిలెట్స్, మంచినీరు, విశ్రాంతి గదులు లేక శ్రామిక మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.
- ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు పూర్తి చేయాలని ఆ గ్రామానికి చెందిన పి.రాంబాబు కోరారు. భవన నిర్మాణానికి ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేస్తుండడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని వినతిలో వివరించారు.
- ఒడిశా నుంచి శ్రీకాకుళం జిల్లాలోని పలు ప్రాంతాలకు విచ్చలవిడిగా నాటుసారా తరలించడం వల్ల అమాయకులైన రైతులు, రైతు కూలీలు సారాకు బానిసలై ప్రాణాలు కోల్పోతున్నారని, తగుచర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, కె.వి.జగన్నాథరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీన ఢిల్లీ రావు, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షులు చౌదరి లక్ష్మణరావు, పి.సురేష్, ఎస్.వెంకటరావు, పి.కొండయ్య, శారదాపురం గ్రామ పెద్దలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
- గత ఏడాది అక్టోబర్ నెలలో హత్యకు గురైన శ్రీకాకుళం పట్టణంలోని కుమ్మరివీధికి చెందిన దళిత యువకుడు లావేటి గురుమూర్తి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆలిండియా దళిత రైట్స్ ఫోరమ్ రాష్ట్ర నాయకుడు కంఠ వేణు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడటంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం రిమ్స్ ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికుల కోసం అన్ని విభాగాల వైద్యులచే అన్ని పరీక్షలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేశారు. దీన్ని ఎమ్మెల్యే గొండు శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో ఈ నెల 17 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులు రోగాల బారిన పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు రుణపడి ఉంటామన్నారు. ఈ సందర్భంగా ఆయుస్మాన్ బార్ హెల్త్ కార్డులను పారిశుద్ధ్య కార్మికులకు అందజేసారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు బీపీని పరీక్షించుకున్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ డాక్టర్ కల్యాణబాబు, జిల్లా వైద్యశాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి, రిమ్స్ సూపరింటెండెంట్ షకీలా, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ సుధీర్ పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న గీతాశ్రీకాంత్

శ్రీకాకుళం న్యూకాలనీ: అందివచ్చిన అవకాశాలను యువతీ యువకులు సద్వినియోగపర్చుకుంటూ ముందడుగు వేయాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్-ఇండస్ట్రీస్, మహిళ విభాగ చైర్‌పర్సన్ డాక్టర్ వై.గీతాశ్రీకాంత్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఎన్నోవేసన్ కౌన్సిల్(ఐఐసీ) ఆధ్వర్యంలో 'ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఎకోసిస్టమ్ డెవలప్‌మెంట్'అనే అంశంపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. చిన్న ఆలోచనను ఆచరణలో పెడితే వ్యాపారవేత్తగా మారే అవకాశాన్ని ఉంటుందన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలతో వ్యాపార రంగంలో ఉజ్వలమైన భవిష్యత్తును అందుకోవచ్చన్నారు. శ్రీకాకుళం నుంచి మంచి వ్యాపారవేత్తలగా ఎదిగిన నవీన్‌కుమార్ కందుల, తారక్ పైడిశెట్టి, డోకి ఢిల్లేశ్వరరావు, టి.రమేష్, బిజు గోపీనాథ్‌లు వారి వ్యాపార రంగ అనుభవాలనుతోపాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులు, వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకుముందు కళాశాల ఐఐసీ కన్వీనర్ డాక్టర్ ఎం.ప్రదీప్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఎకోసిస్టమ్ డెవలప్‌మెంట్ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు.

కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, మైక్రో బయాలజీ అధ్యాపకురాలు పి.సుధారాణి, ప్రశాంతి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను మార్పు చేస్తే సహించేది లేదు



నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల క్యాంపస్: కార్మిక చట్టాలను మార్పు చేస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ అన్నారు. అరిణాంఅక్కివలసలోని శ్యాంక్రిగ్ ఫిస్టన్స్ ఫ్యాక్టరీ-3 వద్ద సోమవారం బ్లాక్ డే కార్యక్రమం నిర్వహించారు.

44 కార్మిక చట్టాలను ఎన్‌డీఏ ప్రభుత్వం నాలుగు టేబర్ కోర్టు చట్టాలుగా మార్పు చేయాలని చూస్తోందని విమర్శించారు. కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చే ప్రయత్నం జరుగుతుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను సమర్థవంతంగా అమలు చేయకపోతే భవిష్యత్‌లో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, సురేష్, సునీల్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ బదిలీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఎంపీడీఓ ఆర్.రమాదేవికి విశాఖపట్నం బదిలీ అయింది. ఆమె ఆదివారం సాయంత్రం రిలీవ్ అయ్యారు. పరిపాలన అధికారి పీపీఎస్ రామ్మోహన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

టౌన్‌ప్లానింగ్ ఏసీపీలకు బదిలీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పట్టణ ప్రణాళిక విభాగం (టౌన్ ప్లానింగ్) అసిస్టెంట్ సిటీ ప్లానర్ 1, 2లు వి.వరహాలబాబు, ఐ.వి.రమణమూర్తి బదిలీ అయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఏసీపీ-2 రమణమూర్తి స్థానంలో జీవీఎంసీ నుంచి ఎస్.వెంకటేశ్వరరావు రానున్నారు. వరహాలబాబు ఇటీవల ఎన్నికల ముందు బదిలీపై వచ్చారు. ఈయన స్థానంలో కొత్త వారిని నియమించాల్సి ఉంది.

కళాకారునికి సత్కారం



మోహనరావును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పార్వతీపురంలోని శ్రీవాణీ ఆర్ట్స్ కళాసంస్థ 11వ వార్షికోత్సవం సందర్భంగా నగరానికి చెందిన పౌరాణిక హార్మోనియం కళాకారుడు, రిటైర్డ్ డీఈ బి.ఏ.మోహనరావును ఘనంగా సత్కరించారు. ఏక పాత్ర పౌరాణిక పద్య నాటక పోటీలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ ఆయన్ని సత్కరించి అభినందించారు.

లావేరు ఎంఈఓ మృతి



ఈశ్వరరావు (ఫైల్)

ఎచ్చెర్ల: లావేరు ఎంఈఓగా పనిచేస్తున్న లండ ఈశ్వరరావు ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు సోమవారం తెలిపారు. లావేరు మండలం జీజీవలస గ్రామానికి చెందిన ఈయన గతంలో రణస్థలం మండలంలో ఎంఈఓగా పనిచేశారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎంఈఓ భౌతిక కాయానికి పలువురు నాయకులు, అధికారులు నివాళుర్పించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ పోలీసు అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరమని పోలీసు అధికారులు అన్నారు. వాహనంతో పట్టుబడితే సదరు మైనర్ వ్యక్తితోపాటు వాహన యజమానిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వి.నాగరాజు, ఎస్సై వి.దేవానందం పేర్కొన్నారు. నగరంలోని భాష్యం స్కూల్ విద్యార్థులకు మైనర్ డ్రైవింగ్‌తోపాటు ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో ప్రతి పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి, వారిలో చైతన్యం నింపుతున్నామన్నారు. సెల్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్ నేరమన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందితోపాటు పాఠశాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

రణస్థలం: గ్రామాల్లో పారిశుధ్య పనులు, ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి, గ్రామ సచివాలయ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం, స్వచ్ఛత హీ సేవా, కొత్త పింఛన్ల మంజూరుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి పలు అంశాలపై సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, ఏఓ ధనుంజయరావు, అధికారులు పాల్గొన్నారు.

అన్నప్రసాదం వితరణ



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

శ్రీకాకుళం అర్బన్: వినాయక నవరాత్రి మహోత్సవం సందర్భంగా నగరంలోని గూనపాలెం రాజీవ్‌పార్కు వద్ద సోమవారం మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గూనపాలెం యువత శోభన్, కల్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గూనపాలెం, మేదరవీధి, చెరువుగట్టు, మండలవీధి, ఎల్‌బీఎస్ కాలనీ, కాకివీధి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గూనపాలెం యువత కొర్ను ప్రతాప్, ఎస్.త్రినాథ్, టి.రాజేశ్వరి, బాలామణి పాల్గొన్నారు.

ఏచూరి మరణం తీరనిలోటు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు లోకానికి తీరనిలోటని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహచలం అన్నారు. నగరంలోని సంఘ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణసభను సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్, జిల్లా నాయకులు జి.ఈశ్వరమ్మ, కంఠ అప్పలనాయుడు. డి.లక్ష్మణరావు, డి.కుమారి పాల్గొన్నారు.

కార్మిక చట్టాల సవరణ తగదు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్మికవర్గం పోరాడి సాధించిన చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా లేబర్ కోడ్‌లుగా సవరించడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు విమర్శించారు. కార్మికుల ప్రాణత్యాగాలు, ఆత్మబలిదానాలతో సాధించిన 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా పార్లమెంటులో చట్టం చేయడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా బ్లాక్ డే నిర్వహించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం పట్టణంలోని పీఎస్ఎన్ఎంహెచ్ స్కూల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను ఎటువంటి చర్చా లేకుండా 2020 సెప్టెంబర్ 22వ తేదీన పార్లమెంట్‌లో పాస్ చేశారన్నారు.

కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, వివిధ సంఘాల నాయకులు ఎస్.నాగేశ్వరరావు, ప్రభావతి, కనకలక్ష్మి ఉన్నారు.

హెచ్‌ఎంకు అరుదైన గౌరవం



ఉమెన్ ఐకాన్ అవార్డులతో అరుణకుమారి

జి.సిగడాం: మండలంలోని అద్వానంపేట ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.అరుణకుమారికి అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల ఆన్‌లైన్‌లో ఉమెన్ వరల్డ్ రికార్డ్స్ ద్వారా నిర్వహించిన ఉమెన్ ఐకాన్-2024 అవార్డును కైవాసం చేసుకున్నారు. ఉమెన్ ఐకాన్ ద్వారా అవార్డులు, ప్రశంసాపత్రం, బంగారు పతకాన్ని సోమవారం పంపించారు. అరుణకూమారి ఆట, పాటలతో కూడిన విద్యను అందిచండం, వినూత్నంగా బోధన, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పన వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. జి.సిగడాం మండలానికి జాతీయ స్థాయిలో పేరు తీసుకువచ్చిన అరుణకుమారికి ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాస రావు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

స్వచ్ఛతే లక్ష్యం



ఎస్ఎంపురం క్యాంపస్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: స్వచ్ఛ క్యాంపస్ లక్ష్యంగా పనిచేస్తున్నామని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) క్యాంపస్ డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఎంపురం క్యాంపస్, చిలకపాలెం అద్దె క్యాంపస్‌ల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఏఓ ముని రామకృష్ణ, అకడిమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదిరి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని మొండేటివీధిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు ఒకటో పట్టణ పోలీసులు సోమవారం తెలిపారు.

వీరి వద్ద నుంచి 95,110 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హరికృష్ణ చెప్పారు.

స్మృతి వనం ఏర్పాటుకు వినతి



రైల్వే అధికారులకు వినతి అందజేస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: దూసి రైల్వే స్టేషన్‌లో మహాత్మా గాంధీజీ విగ్రహంతో పాటు రెండు ఎకరాలలో స్మృతివనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇంటాక్ బృందం రైల్వే అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం విశాఖపట్నంలో జరిగిన డివిజనల్ రైల్వే సమావేశంలో జీఎం పరమేశ్వరరావు, డీఆర్ఎం సౌరవ్ ప్రసాద్‌లను ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, సభ్యులు పొన్నాడ రవికుమార్‌లు కోరారు. క్విట్ ఇండియా ఉద్యమంలో గాంధీజీ చేపట్టిన ప్రతి అంశం భావితరాలకు తెలియజేసేలా కృషి చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఇప్పటికే కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తన మద్దతును తెలియజేస్తూ జిల్లా అభివృద్ధిలో మంచి భూమిక అవుతుందని తెలియజేసినట్లు వారు వివరించారు. గాంధీజీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతున్న నేపథ్యంలో త్వరలో చేపట్టబోయే స్మృతి వనం ఒక అభివృద్ధి సూచికగా ఉంటుందని ఇంటాక్ సభ్యులు పేర్కొన్నారు.

కెమెరా మెన్ మృతికి సంతాపం



గురునాథరావు (ఫైల్)

శ్రీకాకుళం: శ్రీకాకుళంలో ఎలక్ట్రానిక్ మీడియాలో వివిధ సంస్థల్లో కెమెరామెన్‌గా పని చేసిన బూగాపు గురునాథరావు అలియాస్ గుణ అనారోగ్యంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గుణ మృతిపై జర్నలిస్టు సంఘాల నాయకులు నల్లి ధర్మారావు, ఎస్.ఈశ్వరరావు, శాసపు జోగి నాయుడు, కొంక్యాన వేణుగోపాల్ తదితరులు సంతాపం తెలియజేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com